ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 314 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# కష్టపడితేనే పదవులు

## పైరవీలు పని చేయవు - మెరిట్ ఉన్నవారికే పార్టీలో గుర్తింపు : సీఎం

### వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం

### శిక్షణా తరగతులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

### డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరుకానున్న ఖర్గే, కేసీ వేణుగోపాల్



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసిన వాళ్లం అవుతామని పార్టీ నాయకులను ఉద్దేశించి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగించారు.

కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలనే కుట్ర జరుగుతోంది : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మెజార్టీ 2 శాతమే తేడా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ 4 శాతానికి పెరిగిందన్నారు. రెండేళ్ల తర్వాత జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ 12 శాతమని వివరించారు. కార్యకర్తల కృషి, ప్రజల నమ్మకం వల్లే కాంగ్రెస్ ఓటు శాతం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబంలో 3 తరాలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని, ఆయనకు సొంత ఇళ్లు కూడా లేదన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాహుల్‌గాంధీ కుటుంబంపై ఇవాళ నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచే కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీని కనుమరుగు చేయాలని కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ పైరవీల కోసం తిరిగితే ప్రజల్లో, పార్టీలో చులకన అవుతారని రేవంత్ రెడ్డి సూచించారు. వాటిని వదిలేసి ప్రజల తరఫున పోరాడితే గౌరవం, మర్యాద తప్పక పెరుగుతుందని

..మిగతా 2లో



# వాణిజ్య దిగ్బంధం విధిస్తా

### సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ హెచ్చరిక

### అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు వెంటనే అమల్లోకి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది.అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్ నుంచి సంతకం చేయడం తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్ హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్‌లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమీక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన

..మిగతా 2లో

### అమెరికాతో ఒప్పందం

# రైతాంగానికి తీవ్ర నష్టం

### మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం

..మిగతా 2లో



### అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే

# స్వావలంబనతోనే సాధ్యం

### ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబన సాధించడం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనికోసం సెమీకండక్టర్ చిప్‌ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని జేవర్‌లో ఏర్పాటు చేయనున్న సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 'వికసిత భారతానికి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ఎంతో ముఖ్యం. కరోనా సమయంలో చిప్‌ల సరఫరా వ్యవస్థ దెబ్బతినడంతో.. అనేక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధి నిలిచిపోయింది. వివిధ కర్మాగారాల్లో పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చిప్‌ల తయారీలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత దశాబ్దంలో సాంకేతికపరంగా మనం తీసుకుంటున్న చర్యలు.. 21వ శతాబ్దంలో దేశ శక్తిసామర్థ్యాలకు పునాదులు అవుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. హెచ్‌సీఎల్ గ్రూప్, ఫాక్స్‌కాన్ సంస్థలు కలిసి

..మిగతా 2లో

### నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటన..

# డేటా రికవరీ చేయడం కష్టం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**




నాంపల్లి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనలో మొత్తం 1,100 ఫైల్స్ దగ్ధం అయినట్లు నాగ్‌పూర్ నుంచి వచ్చిన స్పెషల్ టీం గుర్తించింది. ఈ దగ్ధమైన ఫైల్స్‌లోని డేటా రికవరీ కోసం ఆ బృందం ఎంతో తీవ్రంగా

..మిగతా 2లో



### ట్రేడ్ డీల్ ఒప్పందంపై

# కాంగ్రెస్ విమర్శలు

### ప్రధాని మోదీ రాజీపడ్డారు

### 18 రోజు వేచి ఉంటే ఏకపక్ష ఒప్పందం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

అమెరికా విధించిన సుంకాలను సుప్రీంకోర్టు రద్దు చేసిన తర్వాత భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికాతో ఏకపక్ష, భారత వ్యతిరేక వాణిజ్య ఒప్పందం చేసేందుకు కేంద్రం తొందరపడిందని ఆరోపించింది. తొందరపాటు అనేది దెయ్యం పని అని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేడా విమర్శలు గుప్పించారు. ఫిబ్రవరి 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వాషింగ్టన్‌కు అర్ధరాత్రి ఫోన్ కాల్ ఎందుకు చేశారని నిలదీశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ గ్లోబల్ టారిఫ్‌లను రద్దు చేసింది. భారత్ మరో

..మిగతా 2లో

# పేలుళ్లకు కుట్ర

### ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

### ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్

### నిఘా వర్గాల హెచ్చరికలు జారీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**



దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందీనీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు

..మిగతా 2లో

### కామారెడ్డి ఎమ్మెల్యే

# క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



2లో..

కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత

పరస్పరం దాడి చేసుకున్న బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు

పోలీసులతో అదుపులోకి పరిస్థితి

# కష్టపడితేనే పదవులు

మొదటి పేజీ తరువాయి...

అభిప్రాయపడ్డారు. సొంత అజెండా వదిలేసి ప్రజా అజెండా, పార్టీ అజెండా కోసం కృషి చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సమస్యలపై కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవిస్తుందన్నారు.

"నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచనలు చెప్పి అందరినీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ 2.5 శాతం నుంచి 40 శాతానికి చేరింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీలో అందరి పని తీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్న వారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది." - రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించింది : మోతీలాల్ నెహ్రూ రూ.వేల కోట్ల ఆస్తులను దేశం కోసం త్యాగం చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన కొన్నాళ్లకే గాంధీజీని కోల్పోయామన్నారు. ప్రజల



సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని రేవంత్ వివరించారు. డీసీసీ పదవి చాలా విలువైనదని, వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని కోరారు. డీసీసీ నుంచి పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం కావొచ్చన్నారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ జిల్లా అధ్యక్షులకు (డీసీసీ) శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మార్చి 2 వరకు డీసీసీ శిక్షణా తరగతులు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లు హాజరు కానున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ట్రేడ్ డీల్ ఒప్పందంపై కాంగ్రెస్ విమర్శలు

మొదటి పేజీ తరువాయి...

18 రోజులు వేచి చూసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఫిబ్రవరి 2న వాషింగ్టన్‌కు అర్ధరాత్రి కాల్ ఎందుకు సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఎందుకు ఆగలేదు జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణే ప్రకటనలే కారణమా జెఫ్రీ ఎఫ్‌స్టీన్ ఫైళ్ల ప్రభావమా గౌతమ్ అదానీకి సంబంధించిన అమెరికా క్రిమినల్ కేసా లేక ఇవన్నీ కారణాలా ఈ రోజు కాంగ్రెస్ వాదన సత్యమైంది. ప్రధాని నరేంద్ర మోదీ రాజీ పడ్డారు' అని పవన్ ఖేడా ఆరోపించారు. అమెరికాతో కుదిరిన ఏకపక్ష వాణిజ్య ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం పునఃసమీక్షించాలని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాల్ అన్నారు. అమెరికా కొత్తగా ప్రతిపాదించిన సుంకాల స్థిరత్వం, భారత్‌పై వాటి వర్తింపును ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '1977లో అమల్లోకి వచ్చిన ఐఈఈపీఏ కింద అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారం లేదని అమెరికా సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 122, 1962 ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్ సెక్షన్ 232, 1974 ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింద ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్‌లు భారత్‌కు వర్తించవని కనిపిస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏంటంటే, ఈ సుంకాలు భారత్‌పై చట్టబద్ధంగా అమలవుతాయా అమెరికా--భారత్ వాణిజ్య ఒప్పందం నిలబడుతుందా రైతులు, చిన్న, మధ్యతరహా వ్యాపారులు, ఇంధన, డేటా నిపుణులు, ఆర్థికవేత్తలు వ్యతిరేకిస్తున్న ఈ ఒప్పందం నుంచి బయటకు రావడానికి మోదీ ప్రభుత్వం ధైర్యం చేస్తుందా' అని సుర్జేవాలా ప్రశ్నించారు. సెక్షన్ 122 (ట్రేడ్ యాక్ట్, 1974) ప్రకారం 150 రోజులపాటు మాత్రమే 10శాతం టారిఫ్ విధించవచ్చని సుర్జేవాలా తెలిపారు. తరువాత అమెరికా కాంగ్రెస్ ఆమోదం అవసరమని, ఇది తాత్కాలిక చర్య మాత్రమే అని అన్నారు. ఇక సెక్షన్ 232 (ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్, 1962) -- జాతీయ భద్రతా కారణాలతో మాత్రమే టారిఫ్ విధించాలని పేర్కొన్నారు. 270 రోజుల్లో అమెరికా వాణిజ్య శాఖ సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని చెప్పారు. భారత ఎగుమతులు జాతీయ భద్రతకు ముప్పు కాదని వివరించారు. అలాగే సెక్షన్ 301 (ట్రేడ్ యాక్ట్, 1974) -- సంబంధిత దేశం అన్యాయ వాణిజ్య పద్ధతులు అనుసరించిందని దర్యాప్తు ద్వారా నిరూపించాలని చెప్పారు. భారత్‌పై అలాంటి దర్యాప్తు జరగలేదని ఆయన వివరించారు. ఇప్పుడు జాతీయ ప్రయోజనాలను రక్షించడానికి ప్రభుత్వం సిద్ధమా అని సుర్జేవాలా ప్రశ్నించారు.ట్రంప్ సుంకాలను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రశంసించారు. ట్రంప్ మొత్తం టారిఫ్ వ్యూహాన్ని కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టుకు అభినందనలు తెలిపారు. కోర్టు భావజాల పరమైన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుంటే 6-3 తీర్పు అద్భుతమైన, స్పష్టమైన నిర్ణయని పేర్కొన్నారు. అంతేకాకుండా. అమెరికా చెక్స్ అండ్ బాలెన్సెస్ వ్యవస్థ ఇంకా పనిచేస్తుందని చురకలేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఇదిలా ఉండగా, అమెరికా 10 శాతం గ్లోబల్ టారిఫ్‌ను అమలు చేసింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రకారం భారత్ కూడా ఈ టారిఫ్ చెల్లించాల్సి ఉంటుందని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ఇక సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రపంచ వాణిజ్యం, వ్యాపార సంస్థలు, వినియోగదారులు, ద్రవ్యోల్బణ ధోరణులు, గృహ ఆర్థిక పరిస్థితులపై విస్తృత ప్రభావం చూపే అవకాశముంది.

## పేలుళ్లకు కుట్ర

మొదటి పేజీ తరువాయి...

నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం ఢిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

## నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటన.. డేటా రికవరీ చేయడం కష్టం

మొదటి పేజీ తరువాయి...

ప్రయత్నించింది. తాజాగా ఈ ఫైల్స్‌లోని డేటా రికవరీ చేయడం కష్టమని ప్రత్యేక బృందం తేల్చి చెప్పింది. ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో వివిధ కేసుల దర్యాప్తులో ఎఫ్ఎస్ఎల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో వెంట్రుకలు, ఎలక్ట్రానిక్ డివైజ్‌ల విశ్లేషణ, రక్తం, వేలిముద్రలు, బుల్లెట్లు, లేదా డీఎన్ఏ నమూనాలు, ఆయుధాలు, డాక్యుమెంట్లు ఫోర్జరీ జరిగాయా లేదా ప్రతీది ఇతర అన్ని ఆధారాలను ల్యాబ్‌లోనే పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తారు. ఈ ఆధారాలు ఎన్నో కోర్టు తీర్పుల్లో కీలకంగా ఉంటాయి. కానీ ఈ ప్రమాద ప్రభావం వల్ల కేసుల దర్యాప్తుపై ఎంత వరకు పడనుందనేది ఆందోళనకరమైన విషయం.



## కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**కామారెడ్డి,ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గిరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నపథ్యంలో శిశు మందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అమెరికాతో ఒప్పందం రైతాంగానికి తీవ్ర నష్టం

మొదటి పేజీ తరువాయి...

సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశర చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వావలంబనతోనే సాధ్యం

మొదటి పేజీ తరువాయి...

జేవర్‌లో 'ఔట్‌సోర్స్‌డ్ సెమికండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్' (ఓఎస్ఏటీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. దీని కోసం రూ.3,700 కోట్ల పెట్టుబడిని ప్రకటించాయి. 2028 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిశ్రమ 3,500 ఉద్యోగాలు సృష్టిస్తుందని అంచనా. ఈ ప్లాంట్ నెలకు 3.6 కోట్ల చిప్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.




## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**తెలంగాణ మీడియా అకాడమి ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారంనాడు తెలంగాణ మీడియా అకాడమిలోని కాన్ఫరెన్సు హాలులో 2వ పాలకమండలి సమావేశం ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్ షాప్ లు, 12 మంది సీనియర్ జర్నలిస్టులు చేసిన సేవలను రాబోయే తరాలకు తెలియపర్చాలనే ఉద్దేశ్యంతో వారి జీవితాలపై మోనోగ్రాఫ్స్ ముద్రించినట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల కాల పరిమితితో నెలకు 3 వేల రూపాయల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు ఆయన వివరించారు. అదే విధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేశామన్నారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 మంది సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియం అదెకు ఇవ్వడానికి సమావేశంలో చర్చించగా కమిటీ సభ్యులు తమ ఆమోదం తెలుపడం పట్ల కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వాణిజ్య దిగ్బంధం విధిస్తా

మొదటి పేజీ తరువాయి...

టారిఫ్‌లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్‌హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్ అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్‌హౌస్‌లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్‌తో ట్రేడ్ డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్- పాక్ యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్-పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.భారత్-పాక్ ఘర్షణ సమయంలో 10 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లు ట్రంప్ తెలిపారు. గురువారం 11 విమానాలు కూల్చివేశారని చెప్పిన ఆయన, ఇప్పుడు సంఖ్యను 10కి తగ్గించారు. ఆ యుద్ధం అణు యుద్ధానికి దారితీసేలా సాగుతోందని అన్నారు. దానిని టారిఫ్‌ల ద్వారానే ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలకు యుద్ధం చేయాలనుకుంటే చేయండని, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు తేల్చి చెప్పాను. ప్రతి దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తాను హెచ్చరించాను. దీంతో ఇరుదేశాలు ఫోన్ చేసి విరమణ ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను. పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

# విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆధునిక ఆలోచనలు వెలికి తీయడానికి యువజనోత్సవాలు దోహదం



బహుమతులు పొందిన విద్యార్థులతో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఉన్నతాధికారులు





సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులు

## వ్యవసాయ వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**బుద్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం):**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అగ్రి యూత్ ఫెస్ట్ ( యువజనోత్సవాలు) విద్యార్థుల యొక్క సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆధునిక ఆలోచనలను వెలికితీసే విదంగా ఉన్నాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు రాష్ట్ర వాప్తంగా ఉన్న 13 వ్యవసాయ కళాశాలల విద్యార్థులకు అగ్రి యూత్ ఫెస్ట్ పేరుతో రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. య వజనోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో ఘనంగా జరిగింది. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం అని భావించేవాడినని, వారి ప్రతిభా పాఠవాలు చూసాక సరైన మార్గదర్శనం, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తే



నాటిక ప్రదర్శన

విద్యార్థులు అద్భుతాలు సృష్టిం చగలుగుతారని అనిపించిందన్నారు. ఆట - పాట- మెగా కిసాన్ మేళా వంటి కార్యక్రమాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారన్నారు. అగ్రి బజ్ పోటీలలో జగిత్యాల, వరంగల్, సంగారెడ్డి కళాశాలలు విశిష్ట ప్రతిభ కనబరిచాయన్నారు. విద్యార్థులు తమ జ్ఞానం, సమయ పాలన, చురుకుదనంతో విజేతలుగా నిలిచారన్నారు. యూత్ పార్లమెంట్ పోటీలలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. టి. భరత్, దోరా వారి బృందం అద్భుతంగా ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. యూత్ పార్లమెంట్ లో ద్వితీయ స్థానంలో వరంగల్ వ్యవసాయ కళాశాల, తృతీయ స్థానం అశ్వారావు పేట్ వ్యవసాయ కళాశాలలకు లభించడం సంతోషకరమన్నారు. బెస్ట్ పార్లమెంటేరియన్ అవార్డును భరత్ అందుకున్నారు. మంత్రి గా మరియు ప్రశంసలు పొందారు. సాహిత్య పోటీలు, ఇంగ్లీషు ఎలక్యూషన్ లో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల మొదటి స్థానం, కాలేజీ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ రెండవ స్థానం. సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాల మూడవ స్థానంలో నిలియాయన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహణ లో డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, డీన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డాక్టర్ వి.రమణారావు, పీజీ డీన్ డాక్టర్ కె బి ఈశ్వరీ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం బలరాం, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం గోవరన్, సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె బి సునీతా దేవి, పాలకమండలి సభ్యులు డాక్టర్ నరేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. యూత్ ఫెస్టివల్ నిర్వాహణ కమిటీలో ఉన్న ప్రొఫెసర్లు, ప్రజా సంబంధాల అధికారులు, విద్యార్థులు యువజనోత్సవాలు విజయవంతంగా జరగడానికి ఎంతో కష్టపడ్డారని విశ్వవిద్యాలయం అధికారులు అభినందించారు.



ఆర్టీసీ రక్షణ కోసం, సంఘాల కోసం, సమస్యల సాధన కోసం ఈ నెల 24న చలో సెక్రటరియేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఆర్టీసీ ఉద్యోగి నడుం బిగించాలని కోరుతు శనివారం రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో ఆవరణలో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఎం హెచ్ అలీ, సీహెచ్ వి సుధాకర్, అంజయ్య, అగ్రయ్య, మల్లేశ్, పాపయ్య, శ్రీకాంత్, బాల్ రాజ్, ప్రశాంత్, భాస్కర చారి, గోపాల్, గఫార్ లు ఉన్నారు.


– బుద్వేల్, ప్రభాత ఉదయం

## జాగృతి రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షునిగా నాగని ప్రకాశ


**బుద్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులుగా శివరాంపల్లి కి చెందిన నాగని ప్రకాశ్ నియమితులైనారు. ఈ మేరకు జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి శనివారం నాగని ప్రకాశ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో జాగృతి ని బలోపేతం చేయడానికి నాగని ప్రకాశ్ కృషి చేయాలని కప్పాటి పాండురంగారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా నాగని ప్రకాశ్ మాట్లాడుతూ, జాగృతి రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షునిగా తనను నియమించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. రాబోయే రోజులలో రంగారెడ్డి జిల్లాలో జాగృతి ని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.



రోదిస్తున్న బాలుని తల్లి అశ్విని రెడ్డి..



రామ్

## ఆసుపత్రిలో చికిత్స పొందుతు
# ఆరు నెలల బాలుడు మృతి

### గడువు ముగిసిన ఇంజక్షన్ ఇవ్వడం వల్లే తమ కుమారుడు మరణించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రాజేంద్రనగర్ పోలీసులు

**బుద్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఆరు నెలల బాలుడు మృ తి చెందిన సంఘటన శనివారం బండ్లగూడ సన్ సిటీ లో జరిగింది. తమ కుమారుని మృతి కి గడువు ముగిసిన ఇంజక్షన్లు ఇవ్వడమే కారణమని బాలుని తల్లిదండ్రులు, బందువులు ఆరోపిస్తున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.... బండ్లగూడ జాగీర్ ప్రాంతానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి, అశ్విని రెడ్డిలు భార్యభర్తలు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక బాబు ఉన్నారు. ఆరు నెలల వయస్సున్న రామ్ అనే తమ కుమారునికి జ్వరం రావడంతో గురు, శుక్ర వారాలలో సన్ సిటీ లో ఉన్న క్రెయాన్స్ హాస్పిటల్ లో ఔట్ పేషేంట్ గా చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో శనివారం అదే హాస్పిటల్ లో ఇన్ పేషేంట్ గా చేర్చించారు. చికిత్స పొందుతున్న బాలుడు మద్యాహ్నం మరణించాడు.

**తమ కుమారుని మరణానికి గడువు ముగిసిన ఇంజక్షన్ ఇవ్వడమే కారణం : రామ్ తండ్రి విష్ణువర్ధన్**

:తన ఆరు నెలల కుమారుడు రామ్ మరణానికి క్రెయాన్స్ హాస్పిటల్ డాక్టర్లే కారణమని బాలుని తండ్రి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఇదే విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జ్వరంతో ఉన్న తన కుమారునికి గడువు ముగిసిన ఇంజక్షన్ ఇచ్చారని, ఆ తర్వాత తన కుమారుని రంగు మారి మరణించాడన్నారు. హాస్పిటల్ డాక్టర్ల సర్టిఫికెట్ ను రద్దు చేసి వైద్య ఆరోగ్యశాఖ ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలన్నారు. కుమారుని మరణంతో బాలుని తల్లి అశ్వినిరెడ్డి రోదిస్తున్న తీరు అందరిని కలచి వేసేదిగా ఉంది.

ఒక్కగానొక్క కొడుకు మరణం బాధాకరం బాలుని పెద్దనాన్న ముత్యంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి అశ్వినిరెడ్డిలకు ముందు ఇద్దరు పాపలు ఉన్నారని, ఆ తర్వాత పుట్టిన రామ్ మరణం బాధాకరమని బాలుని పెద్ద నాన్న ముత్యంరెడ్డి వివరించారు. ఆసుపత్రి నిర్లక్ష్యంగా కారణం గానే బాలుడు మరణించాడని వాపోయారు.

**హాస్పిటల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం: రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ ఎం ముత్తు యాదవ్**

తన కుమారుడు ఆసుపత్రిలో గడువు ముగిసిన ఇంజక్షన్ ఇవ్వడం కారణంగానే మృతి చెందాడని బాలుని తండ్రి విష్ణువర్ధన్ రెడ్డి, బందువులు పిర్యాదు చేశారు. దీంతో సన్ సిటీ లో ఉన్న క్రెయాన్స్ ఆసుపత్రిపై కేసు నమోదు చేశాం. ఆసుపత్రిలో గడువు ముగిసిన మందులు, ఇంజక్షన్లు ఉన్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటాం



# రామ్మోహన్ నాయుడిని తొలగించండి

### ప్రధాని మోడీకి ఎన్‌సిపి ఎమ్మెల్యే రోహిత్ పవార్ లేఖ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడిని తక్షణమే పదవి నుండి తొలగించాలని కోరుతూ ఎన్‌సిపి (శరద్‌పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక లేఖ రాశారు. ఈ ఏడాది జనవరి 28న బారామతి ఎయిర్‌పోర్టులో జరిగిన విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా ఐదుగురు చనిపోయిన సంగతి తెలిసిందే. ఒక కుట్రలో భాగంగానే నాటి ప్రమాదం జరిగిందని, విమానయాన సంస్థకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న టిడిపికి సన్నిహిత సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని మోడీకి తన లేఖలో రోహిత్ విన్నవించారు. ఇదే విషయంపై ఆయన మీడియాతోనూ మాట్లాడారు. నాటి ప్రమాదం వెనుక రెండు కోణాలు వుండేందుకు అవకాశం వుందని అవి రాజకీయ లేదా వాణిజ్యపరమైన కోణాలు కూడా కారణం కావచ్చని ఆయన పేర్కొన్నారు. వాటిల్లో ఏది కారణమనేది తేల్చుకోవాలని తమ పార్టీ ప్రయత్నిస్తోం దన్నారు. ఒక కుట్రలో భాగంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఎయిర్ చార్టర్ కంపెనీ విఎస్‌ఆర్‌కు ఇందులో ప్రమేయం వుందన్నారు. విఎస్‌ఆర్ కంపెనీ గురించి, రామ్మోహన్ నాయుడు పార్టీ తెలుగుదేశంతో దానికి గల సంబంధాల గురించి అనేక తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. అందువల్ల స్వతంత్ర, సమర్ధవంతమైన అధికారితో ఈ సంబంధాలపై దర్యాప్తు జరగాలన్నారు. ప్రాధాన్యతా ప్రాతిపదికన అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకోవాలని ఆ లేఖలో ఆయన సూచించారు. లేఖ ప్రతిని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కూడా పంపారు. అజిత్ పవార్‌కు సన్నిహిత బంధువు అయిన రోహిత్ పవార్ మొదట నుండి ఈ ప్రమాదంలో కుట్ర కోణం వుందంటూ మీడియాతో మాట్లాడుతునే వస్తున్నారు. పారిశ్రామిక, రాజకీయ రంగాలకు చెందిన అనేకమంది పలుకుబడి కలిగిన వ్యక్తులు ఈ విఎస్‌ఆర్‌లో వున్నారని తన నిర్ధారణల్లో తేలిందన్నారు. ఈ కారణంగానే దర్యాప్తు పక్రియ పారదర్శకంగా జరగబోదని తాను భావిస్తున్నానన్నారు. విఎస్‌ఆర్‌కు సంబంధించి ఏ రీతిలోనైనా డిజిసిఎ రాజీ పడిందా లేదా అనే అంశంపై దర్యాప్తు జరిగే సమయంలో ఎలాంటి ప్రభావాలు లేదా జోక్యాలు లేకుండా చూడాలని కోరుతున్నట్లు రోహిత్ పవార్ ఆ లేఖలో కోరారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వినతి పత్రం అందజేస్తున్న సీనియర్ జర్నలిస్ట్, సామాజికవేత్త మ్యాడమ్ మధు

## మూసీ నది వ్యర్థాలపై
# సీరియస్ దృష్టి..
## బాధ్యులపై చర్యలు తప్పవు

### ఇతర శాఖలతో సమావేశం.. హైడ్రా కమిషనర్ రంగనాథ్

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో మూసీ నది ఒడ్డున ప్రమాదకర వ్యర్థ పదార్థాలను రసాయనాలను వేసే వారిపై కఠిన చర్య తీసుకుంటామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. శనివారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ లక్ష్మీ నగర్, మూసీ నది ఒడ్డున ప్రమాదకర వ్యర్థ పదార్థాలు, రసాయనాల వల్ల వాయు కాలుష్యం ఏర్పడి అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నయని అత్తాపూర్ లక్ష్మీ నగర్, సోమిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల వాసులు సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథుని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ వ్యర్థ పదార్థాల తొలగింపు విషయంలో జిహెచ్ఎంసి మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ అధికారులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. దీనిపై స్పందిస్తూ ఈ విషయంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, పెడతా పదార్థాల తొలగింపునకు ఇతర శాఖలతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. స్థానికులు కూడా సివిక్స్ సెన్స్ తో మెలిగి ప్రభుత్వ అధికార యంత్రంగాని సహకరించాలని కోరారు.

# విద్యుత్ సంస్థ నియామకాల్లో బిసి రిజర్వేషన్ల ఉల్లంఘన

### మార్చి 4న నేరుగా పరిశీలించాలని కమిషన్ నిర్ణయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్ మరియు ఎస్‌పీడీసీఎల్ సంస్థల నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం బిసి కమిషన్ దష్టికి తీసుకువచ్చింది. ఈ అంశంపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో భాగంగా మార్చి 4వ వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి ఈ విషయంపై విచారణ నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. మరోవైపు రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణ వేగవంతం చేయాలని కమిషన్ అధికారులకు సూచించింది. రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం శనివారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బాల మాయ దేవి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో అధికారులు డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ హాజరయ్యారు. సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది.

# నార్మ్‌లో క్షమతా భవన్ ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్మెంట్ లో నూతనంగా నిర్మించిన క్షమతా భవన్ ను ప్రారంభిస్తున్న కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



క్షమతా భవన్

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో రాజేంద్రనగర్ బీజేపీ నాయకులు



**బుద్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

నూనె గింజలు, చిరు ధాన్యాలలో రైతులకు లాభదాయకతను పెంచడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మం త్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా ఆ సంస్థ ఆవరణలో నిర్మించిన క్షమతా భవన్ ను శనివారం ఆయన భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్ తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ వ్యాపార నిర్వాహణ విద్యార్థులతో పాటు వాటాదారులకు, విద్యా కార్యక్రమాలు అదనపు సంఖ్యలో సామర్థ్య నిర్వాహణ కార్యక్రమాలను నిర్వహించడానికి క్షమతా భవన్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్ మాట్లాడుతూ, వ్యవసాయంలో శాస్త్రీయ పరిశోధనల కోసం ఆలోచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య వ్యవసాయ విద్య డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాయ్ క్రిష్ణ జెనా తో పాటు నార్మ్ అధికారులు, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి మల్లేశ్ యాదవ్, బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి, గౌరి దేవి, రాచూరి రాజశేఖర్, హరికిషన్ జీ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి కెపిహెచ్బిలో ప్రజా సమస్యలపై గాదె శివ పాదయాత్ర

## అబ్దుల్ కలాం పార్క్‌లో సమస్యల పరిశీలన, తక్షణ చర్యలు

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గంలోని కెపిహెచ్బి 6వ ఫేజ్‌లో ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ ను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ నేత గాదె శివ మిత్రబృందంతో కలిసి సందర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్న యువ నాయకుడు గాదె శివ, పార్కులో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.



**పాదాచారులతో కలిసి పాదయాత్ర**

కెపిహెచ్ బి 6వ ఫేజ్, వసంతనగర్, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాలకు చెందిన వాకర్స్ బృందంతో కలిసి గాదె శివ పాదయాత్ర నిర్వహించారు. పార్క్ వాకర్స్, కాలనీ వాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వినిపించుకున్న గాదె శివ, వాటిని స్థలంలోనే పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.

**గుర్తించిన ప్రధాన సమస్యలు పరిష్కారానికి తీసుకున్న అంశాలు**

డ్రైనేజ్, పార్కు పరిశుభ్రత లోపాలు, జిమ్ ఎక్విప్మెంట్స్ దెబ్బతినడం, వాకింగ్ ట్రాక్ సమస్యలు, ప్రహరీ గోడ అనవసర ఎత్తు, బోర్‌వెల్స్ పాడవడం, వీధి దీపాలు పనిచేయకపోవడం వంటి అంశాలు దృష్టికి వచ్చాయి.

**జీహెచ్ఎంసీ అధికారులతో చర్చలుఉ వెంటనే చర్యలు**

సమస్యలపై స్పందిస్తూ గాదె శివ వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులను, సానిటేషన్ సిబ్బందిని రప్పించి పార్క్ లోపల బయట పరిశుభ్రత పనులు ప్రారంభించారు.

వీధి దీపాల సమస్యపై ఎలక్ట్రికల్ విభాగంతో చర్చించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. బోర్‌వెల్ సమస్యపై జీహెచ్ఎంసీ అధికారి విజయశ్రీ తో మాట్లాడగా, మోటార్ కాలిపోవడం కారణమని గుర్తించారు. మోటార్ రిపేర్ చేయడం లేదా అవసరమైతే కొత్త మోటార్ ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించారు.

**యోగా, మెడిటేషన్ సెంటర్ల సందర్శన**

పార్కులోని యోగా సెంటర్, మెడిటేషన్ సెంటర్‌లను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్స్‌తో వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, వాకర్స్‌తో కాసేపు సరదాగా ముచ్చటించారు.

**కాలనీ వాసుల అభినందనలు**

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించిన గాదె శివను చూసి సిక్స్ ఫేజ్, వసంతనగర్, భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు వాకర్స్ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా నిత్యం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

**"ప్రజలకు -పార్టీకి మధ్య వారధిని మాత్రమే" గాదె శివ**

ఈ సందర్భంగా గాదె శివ మాట్లాడుతూ... నేను ప్రజలకి, కాంగ్రెస్ పార్టీకి మధ్య వారధిని మాత్రమేనని, ప్రజల సమస్యలను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతాను అని తెలిపారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రమేష్ కి, లక్ష్మయ్య కి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు సహాయం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ జనరల్ సెక్రటరీ మేదక కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామరావు చౌదరి, సురేష్, హరిప్రసాద్ నాయుడు, జనార్ధన్, రవి, జేఏస్సీ చైర్మన్ డాక్టర్ భిక్షపతి,సాంబశివరావు, రామారావు, రాజు, మున్సిపల్ సిబ్బంది, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# పాగుంట వెంకన్నను దర్శించుకున్న గద్వాల్ మున్సిపల్ చైర్ పర్సన్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి21(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని శనివారం గద్వాల్ మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ నర్సింహ్మా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించి, ఆలయ విశిష్టతను వివరించారు. వారి వెంటా మాజీ సర్పంచ్ ఆంజనేయులు, యుగంధర్ రెడ్డి, ఆలయ సిబ్బంది ఉన్నారు.



కౌన్సిలర్‌ను సన్మానం చేస్తున్న దృశ్యం

# కౌన్సిలర్ రామగాళ్ల విజయ్ కుమార్‌కు సన్మానం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**

జనగామ మున్సిపాలిటీ లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో 2వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామగాళ్ల విజయ్ కుమార్ గెలుపొందినారు. శనివారం వార్డు ప్రజలు, నాయకులు కలసి అంబేద్కర్ నగర్ లోని కౌన్సిలర్ విజయ్ కుమార్ స్వగృహం లో పూల దండ, శాలువా తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ వార్డు ప్రజల సంక్షేమమే నా ప్రధాన లక్ష్యం, వారికీ నాయకునిగా కాకుండా సేవకునిగా, సమస్యల పరిష్కారం కోసం ముందుండి పని చేస్తానని వార్డు ప్రజలకు నాయకులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కొంగరి నర్సయ్య, అంబేద్కరిస్ట్ జేరిపోతుల ఉపేందర్ సిపిఎం నాయకులు ఆడెపు రామ్ మల్లయ్య, గుండె మల్లేష్, సందేనా అర్జున్, దండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ని మహబూబ్ నగర్ జిల్లాలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ కురుమూర్తి స్వామి మాజీ చైర్మన్ జనంపల్లి శ్రీనివాస్ రెడ్డి మంత్రి ని కలిసి వారికి అభినందనలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో రవీందర్ రెడ్డి దంపతుల కుమార్తె వివా వేడుకకు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



## జిల్లాలోని సఖి - వన్ స్టాప్ సెంటర్

# ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తూలకు ఆహ్వానం

## జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం):**

జనగామ జిల్లాలోని సఖి - వన్ స్టాప్ సెంటర్ లో ఖాళీగా ఉన్న ఈ క్రింది పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను జనగామ జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శనివారం ఒక ప్రకటనలో కోరడమైనది.

**ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు:**

1) పారా లీగల్ పర్సనల్/లాయర్ (01): న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉన్నవారు/న్యాయ శిక్షణ లేదా చట్టాలపై పరిజ్ఞానం కలిగి, జిల్లా స్థాయిలో ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర మహిళా సంబంధిత ప్రాజెక్ట్/కార్యక్రమంలో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం లేదా ఏదైనా న్యాయస్థానంలో కనీసం 2 సంవత్సరాల అనుభవం ఉండాలి. గౌరవ వేతనం: రూ.25,000/-

2) కేస్ వర్కర్ (మహిళలు మాత్రమే) (01) లా/సోషల్ వర్క్, సోషియాలజీ, సైకాలజీలో బ్యాచిలర్ డిగ్రీ కలిగి, ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ప్రాజెక్ట్, కార్యక్రమంలో మహిళలకు సంబంధించిన రంగాలలో కనీసం 3 సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

**స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడును.**

గౌరవ వేతనం: రూ. 20,000/-

3)పారా మెడికల్ పర్సనల్ (మహిళలు మాత్రమే) (01): పారామెడిక్స్‌లో ప్రొఫెషనల్ డిగ్రీ, డిప్లొమా కలిగి, జిల్లా స్థాయిలో ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ఆరోగ్య ప్రాజెక్ట్, కార్యక్రమంలో 3సంవత్సరాల పని అనుభవం ఉండాలి.

గౌరవ వేతనం: రూ. 15,000/-

ముఖ్యమైన వివరాలు:

ధరఖాస్తు తేదీలు: 22.02.2026 నుండి 01.03.2026 వరకు

అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా దేవాదుల క్యాంపు ఆఫీస్, సఖి - వన్ స్టాప్ సెంటర్ నందు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు సమర్పించవలెను.

సమర్పించాల్సిన పత్రాలు :

దరఖాస్తుతో పాటు ఎస్ఎస్సి మెమో, విద్యార్హత పత్రాలు, అనుభవ ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జత చేయాలి. తదుపరి వివరాలు అభ్యర్థులకు తెలియపరుస్తాము. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 9347186918.

ఇట్టి నోటిఫికేషన్ లో మార్పులు, చేర్పులు, పూర్తిగా రద్దు చేయుటకు పూర్తి అధికారము జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ జనగామ జిల్లాకి కలదన్నారు.



ప్రిన్సిపాల్ తో మాట్లాడుతున్న పేరెంట్స్ కమిటీ

# పాలకుర్తి గురుకుల (వెలుగు) హాస్టల్‌ను సందర్శించిన పేరెంట్స్ కమిటీ

## ఇంటర్, పదవ తరగతి రిజల్ట్స్ లో జిల్లా లోనే మొదటి స్థానాన్ని తీసుకురావాలి

## పేరెంట్స్ కమిటీ చైర్మన్ జేరిపోతుల ఉపేందర్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**

జిల్లా లోని పాలకుర్తి మండల కేంద్రం లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికల)ను, శనివారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ జేరిపోతుల ఉపేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ గురుకుల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొంగరి నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి ఆడెపు మల్లయ్య. గుండె మల్లేష్ తదితరులు హాస్టల్ ను సందర్శించి, పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ స్వరూప తో కలిసి మాట్లాడుతూ రానున్న నెల రోజులు చాలా విలువందని, ఇంటర్ మీడియట్, పదవ తరగతి పిల్లలకు పరీక్షల సమయం కావడం వలన పిల్లలకు సరియైన సమయంలో శుచి, శుభ్రతో కూడుకున్న అల్పాహారం ఆహారం, సమయానికి అందించాలని, అలాగే హాస్ మేడమ్స్ సబ్జెక్టు టీచర్స్ వారితో ఎక్కువ సమయం కేటాయించి, సబ్జెక్టు డౌట్స్ క్లియర్ చేయాలని కోరారు. ఇంటర్, పదవ తరగతి పరీక్ష లలో జిల్లా లోనే మొదటి స్థానం లో నిలవాన్నారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు పేరెంట్స్ కమిటీ తరుపున ఇంటర్, పదవ తరగతి పిల్లలను పరీక్షల సమయంలో ఎవ్వరు కూడా తమ పిల్లలను ఇంటికి తీసుకువెళ్ళవద్దని, విజ్ఞప్తి చేశారు.



# ఆయిల్ పాం సాగుపై ఆసక్తి చూపుతున్న రైతన్నలు

## జిల్లా ఆయిల్ పెడ్ ఇంచార్జి శివ నాగిరెడ్డి

## వడ్డేపల్లి మండలం శాంతి నగర్‌లో ఆయిల్ పాం సాగు పై అవగాహనా సదస్సు!

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి21(ప్రభాత ఉదయం)**

ఆయిల్ పాం సాగుతో రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఆయిల్ పెడ్ ఇంచార్జి శివ నాగిరెడ్డి తెలిపారు. శనివారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ మండలం ఆఫీస్ ఆవరణలో శనివారం ఆ యిల్ పాం సాగు పై రైతు అవగాహన సదస్సు నిర్వహించారు.తెలంగాణ అయిల్ ఫెడ్ కార్పొరేషన్ , వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జరిగిన రైతుల అవగాహన సధస్సు లో జిల్లా ఆయిల్ పెడ్ ఇంచార్జి శివ నాగిరెడ్డి మాట్లాడుతూ... రైతులు ఆయిల్ పాం పంటసాగు వైపు దృష్టి సారించాలన్నారు.పామాయిల్ సాగుపై రైతు అవగాహన అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో ప్రతి రైతు కు ఆయిల్ పాం సాగు పై లాభాల ను వివరించి రైతు ను రాజు చేసేందుకు ఈ సధస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు .పామాయిల్ సాగు కు అధిక సబ్సిడీ లతో ప్రభుత్వం గ్యారెంటీ ధర ను నిర్ణయించి దళారీ వ్యవస్థ లేకుండా రైతు కు లాభాలు వచ్చేలా ఆయిల్ ఫెడ్ పని చేస్తుందన్నారు.దేశంలో వంట నూనెల అవసరం రోజు రోజుకు పెరుగుతోంది.ఈ అవసరాన్ని దేశంలోనే తీర్చడానికి ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తోందన్నారు.పామాయిల్ పంట ఒకసారి నాటితే 25ఉ30 సంవత్సరాల పాటు ఆదాయం ఇచ్చే దీర్ఘకాల పంట.అని తోట నాటుకుంటే భవిష్యత్ కు భరోసా అన్నారు.3వ సంవత్సరం నుంచి పండ్లు రావడం మొదలు,4వ సంవత్సరం నుంచి పూర్తిగా దిగుబడిఒక ఎకరాకు మంచి దిగుబడి వస్తుందిప్రభుత్వం ధర నిర్ణయించి మిల్లులు కొనుగోలు చేస్తాయని వివరించారు. త్వరలో నే గద్వాల్ జిల్లాలో ఆయిల్ పాం ప్రాసెసింగ్ మిల్‌ఏర్పాటు కు ప్రభుత్వం సిద్ధం గా ఉందని తెలిపారు. ఈ పంట వేసుకోవడం వల్ల దీర్ఘకాల ఆదాయం, ఆయిల్ దిగుబడి ఎక్కువఅని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి రాధ, ఏఇ వో లు చంద్ర కళ, వినోద్, ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న ట్రాన్సజెండర్స్

# ట్రాన్స్‌జెండర్స్‌కు ఉపాధి, పునరావాస పథకం కింద చెక్కుల పంపిణీ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం):**

జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా అధికారి కే. కోదండ రాములు ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక పునరావాసం, ఉపాధి కల్పన లక్ష్యంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ చేతుల మీదుగా జనగామ జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక పునరావాస పథకం కింద ఒక్కొక్కరికి 75 వేల రూపాయల చొప్పున చొప్పున మొత్తం 3 యూనిట్లకు రూ.2 లక్షల25 వేల రూపాయలు 100 శాతం సబ్సిడీతో చెక్కులు పంపిణీ చేశారు.



# విద్యార్థుల ప్రగతి కొరకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలి

**గద్వాల ప్రతినిధి, ఫిబ్రవరి21(ప్రభాత ఉదయం)**

విద్యార్థుల ప్రగతి కొరకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని గట్టు ఎస్ ఐ శేఖర్ గౌడ్ అన్నారు. శనివారం గట్టు మండలం అరగిద్ద, ఆలూరు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాల్గొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు, హాజరు, ఆరోగ్యం, పోషకాహారం, క్రమశిక్షణ వంటి అంశాలపై చర్చించారు. పరీక్షల సమయంలో విద్యార్థులను ఇతరులతో పోల్చకుండా ఉండాలని, ఆరోగ్యకరమైన పౌష్టికారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచనలు చేస్తూ సమావేశంలో పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాలకు హాజరవుతూ విద్యార్థి ప్రగతిని తెలుసుకుంటూ వారి యొక్క విద్యాభివృద్ధి గురించి తెలుసుకోవాలని అధ్యాపకులు ఇచ్చిన సలహా సూచనలు పాటిస్తూ వారి ప్రగతి కొరకు కృషి చేయాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అరగిద్ద సర్పంచ్ బాలకృష్ణ, హెచ్ఎం చంద్రకాంత్,ఎంవిఎఫ్ ఫౌండేషన్ సభ్యులు కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడుకోవడం అందరి బాధ్యత

## జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

### కొనసాగుతున్న "జలమండలి.. బస్తీ బాట..!

**హైదరాబాద్, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**



నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాల్సిన మనందరి బాధ్యత అని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా సీవరేజ్ సమస్యలను గుర్తించడానికి జలమండలి చేపట్టిన "జలమండలి.. బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా ఉప్పాలగూడలోని సెక్రటేరియట్ కాలనీ, శ్రీ నగర్ కాలనీ ప్రాంతంలో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.నీటి సరఫరా సమయంలో పలు ఇండ్లను సందర్శించిన ఎండీ నీటి సరఫరాలో సమస్యల కోసం ఆరాతీశారు. క్యూఏటీ సిబ్బందితో కలిసి క్లోరిన్ స్థాయిలు, నీటి ప్రెషర్, నీటి సరఫరా సమయాలపై సమీక్షించారు. అలాగే, సివరెజ్ నెట్ వర్క్ పై కాలనీ వాసులతో చర్చించారు. కాలనీలలో విస్తృతంగా సందర్శించిన జలమండలి ఎండీ కొంతమంది తాగునీటిని వృథా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. నీటిని వృథా చేయకుంటే, పొదుపు చేసినట్టే అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని కాపాడుకునేందుకు వారి వంతు ప్రయత్నం చేయాలని అన్నారు. విద్యావంతులు నీటి పొదుపు పట్ల మరింత బాధ్యతగా ఉండాలని, ఇతరులకు అవగాహన కల్పించడంలోనూ ముందుండాలని కోరారు. జలమండలి సుదీర్ఘ ప్రాంతాలనుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నగరవాసుల నీటి అవసరాలను తీర్చడానికి కృష్ణా, గోదావరి నదులనుంచి నీటిని తరలించి, శుద్ధి చేసి నగర ప్రజలకు సరఫరా చేస్తోందని అన్నారు. కావున నీటిని వృథా చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా నీటిని వృథా చేస్తున్న వారిని.. ఇది మళ్ళీ పునరావృత్తం అయితే పెనాల్టీ విధించాలని అధికారులను ఆదేశించారు. నీటిని వృథా చేసే వారిపై ఫిర్యాదు చేయడానికి త్వరలో ప్రత్యేక మొబైల్ యాప్ ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ యాప్ ద్వారా నీటిని వృథా చేస్తున్న వారిపై పౌరులు ఎవరైనా ఫోటో అప్లోడ్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు.అధికారులు పరిశీలించి దానికనుగుణంగా వారికి పెనాల్టీ విధిస్తారని వివరించారు.ఆ ప్రాంతాల్లో భూగర్భజలాల పరిస్థిని, బోరుబావుల స్థితిగతులను స్థానికులను అడిగి తెలుసుకున్న ఎండీ.. ఆ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ డిమాండ్, బుకింగ్, డెలివరీ సమయాలపై సమీక్షించారు. జలమండలి ఈడి, ఆపరేషన్ డైరెక్టర్ నారాయణ స్థానిక అధికారులు పాల్గొన్నారు. యధావిధిగా ఈ రోజూ ఉదయం 6 గంటలనుంచే జలమండలి జేఎండీ, ఈడీలు, సిజిఎంలు, జీఎంలు, అధికారులు క్షేత్ర తనిఖీలు నిర్వహిస్తూ తమ తమ పరిధిలో నీటిసరఫరా సివరేజ్ పనులను మెరుగుపరిచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

**చిత్రపురి ఎస్టీపీని సందర్శించిన ఎండీ**

ఖాజాగూడ చెరువు దిగువ ప్రాంతం, మణికొండ , చిత్రపురి కాలనీ ప్రాంతాల నుండి ఉత్పత్తి అయ్యే మురుగును శుద్ధి చేయుటకు చిత్రపురి హిల్స్ సమీపంలో 30 ఎంఎల్డీ సామర్థ్యంతో నిర్మితం అవుతున్న చిత్రపురి మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఎండీ అశోక్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం కోసం వినియోగదారుల డిమాండ్ అంచనా వేయాలని సూచించారు. డిజైన్లో శుద్ధి చేసిన నీటి సరఫరాకు యూనిట్ను తప్పనిసరిగా చేర్చాలని, శుద్ధి చేసిన నీటి నిల్వ కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, అనగా ట్రీటెడ్ వాటర్ సంప్ ఏర్పాటు చేయాలని చెప్పారు. చిత్రపురి కాలనీ పరిసర ప్రాంతాలలో గార్డెనింగ్, నిర్మాణ కార్యకలాపాలు, ఫ్లషింగ్, ల్యాండ్‌స్కేపింగ్ తదితర అవసరాల కోసం ట్యాంకర్ ద్వారా శుద్ధి చేసిన శుద్ధి జలాన్ని సరఫరా చేయడానికి ప్రత్యేక ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు.



# సామ్రాజ్యవాదంపై యువతకు అవగాహన

## డివైఎఫ్ఐ సామూహిక అధ్యయనం

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

యువతలో రాజకీయ అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉన్న ఈ సమయంలో రెడ్ బుక్ డే సందర్భంగా నిర్వహించిన సామూహిక అధ్యయన కార్యక్రమం చైతన్య వాతావరణాన్ని సృష్టించింది. శనివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో కూకట్ పల్లిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు చైతన్య రెడ్డి మాట్లాడుతూ, సామ్రాజ్యవాద విధానాలు ప్రపంచ దేశాల ఆర్థిక, రాజకీయ వ్యవస్థలపై చూపుతున్న ప్రభావాలను సమగ్రంగా విశ్లేషించారు. అభివృద్ధి పేరుతో బలహీన దేశాల వనరులను దోచుకునే విధానాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను అర్థం చేసుకోవడం ద్వారా సమాజంలో బాధ్యతాయుత పాత్ర పోషించగలరని తెలిపారు. పుస్తక పఠనం కేవలం సాహిత్యాస్వాదనకే పరిమితం కాకుండా, చరిత్రాత్మక అవగాహనను పెంపొందించే సాధనమని ఆయన పేర్కొన్నారు. సామూహిక అధ్యయనాల ద్వారా చర్చా సంస్కృతి బలోపేతం అవుతుందని, యువతలో విమర్శనాత్మక దృష్టికోణం పెరుగుతుందన్నారు. ప్రపంచ రాజకీయ పరిణామాలు, ఆర్థిక అసమానతలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆలోచనాత్మక చర్చలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. యువత కేవలం ప్రేక్షకులుగా కాకుండా సమాజ మార్పులో భాగస్వాములుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్ బుక్ డే ప్రాముఖ్యతను వివరించి, ఇటువంటి అధ్యయన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ యువతలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీను, పవన్, ఆతిథ్య, అశోక్, హనుమంతు, జగన్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆల గోపాల్ రెడ్డి మృతి

## గోపాల్ రెడ్డికి నివాళులర్పించిన పోలీస్ ఉన్నతాధికారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**



మాజీ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆల గోపాల్ రెడ్డి వృద్ధాప్యంతో శనివారం మృతి చెందారు. గోపాల్ రెడ్డి ది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామం. గోపాల్ రెడ్డి పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందించి, డీజీపీ కార్యాలయం హైదరాబాద్‌లో భద్రత మరియు ఆరోగ్య భద్రత విభాగాలలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు .ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రశంసలు, ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడ సమాజ సేవ, ప్రజా సంబంధాల పట్ల అపారమైన మక్కువతో సేవలందించిన మహోన్నత వ్యక్తి. గోపాల్ రెడ్డి అకాల మరణం కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, పోలీసు శాఖకు తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి పోలీస్ అధికారులు, ప్రముఖులు, కుటుంబ సభ్యులు ప్రార్థించారు. గోపాల్ రెడ్డి అంతిమ వైకుంఠ యాత్ర శనివారం మధ్యాహ్నం వెస్ట్ మారేడుపల్లి నివాసం నుండి బయలుదేరి 3-00 గంటలకు జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానం లో అంతిమ క్రియలు నిర్వహించారు. పోలీస్ లు గౌరవ వందనం తర్వాత కుటుంబ సభ్యులు బంధువులు పోలీస్ ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు, వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమల్ల భీంరెడ్డి నివాళులు అర్పించారు.



జేఎన్టీయుహెచ్ జేఏసీ నూతన డైరీ ఆవిష్కరణ

# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శక గ్రంథం ఈ డైరీ

## విద్యా వ్యవస్థ పై సమగ్ర సమాచారం ఇందులో పర్చబడింది

### జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్. మంద రంజిత్ కుమార్

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

2026 సంవత్సరానికి సంబంధించిన జేఎన్టీయుహెచ్ జేఏసీ నూతన డైరీనీ శనివారం విసి చాంబర్లో జేఎన్టీయుహెచ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ సీనియర్ ప్రొఫెసర్ విజయ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర రావు చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఎన్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్. మంద రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఈ డైరీ సాధారణ పుస్తకం కాదని విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శక గ్రంథం అనీ రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యా వ్యవస్థపై సమగ్ర సమాచారం ఇందులో పొందుపరచబడిందనీ అన్నారు. ఇంటర్ తర్వాత ఏ పరీక్ష? ఏ కోర్సు? ఎన్ని సంవత్సరాలు? ఏ రాష్ట్రంలో, ఏ కాలేజీలో అందుబాటులో ఉంది? అన్న వివరాలు స్పష్టంగా అందించబడ్డాయని తెలిపారు. జేఎన్టీయుహెచ్ అనుబంధ, ఆటోనమస్ కళాశాలల పూర్తి వివరాలతో పాటు హైకోర్టు, గవర్నర్, సీఎం పేషీ, రాష్ట్ర మంత్రివర్గం, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల వివరాలు కూడా చేర్చబడ్డాయని తెలిపారు. ఒక వ్యక్తికి అవసరమైన సమగ్ర సమాచారం ఒకే డైరీలో అందుబాటులో ఉండేలా రూపకల్పన చేయడం జరిగిందనీ, గత నాలుగు సంవత్సరాలుగా నిరంతర విజయంతో జేఎన్టీయుహెచ్ జేఏసీ డైరీని ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. మా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జి. చెన్నయ్య, మెడి పాపయ్య సహకారంతో సంఘం మరింత బలంగా ముందుకు సాగుతోందని డాక్టర్. మంద రంజిత్ కుమార్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు ఎక్కడైనా అన్యాయాన్ని ఎదుర్కొంటే జేఎన్టీయుహెచ్ జాక్ కమిటీ ముందుంటుందని, హక్కుల కోసం పోరాటం ఆగదనీ, సమస్యల పరిష్కారంలో రాజీ ఉండదని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ బొజ్జ ప్రణయ భాస్కర్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొడెం సాయి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ మూడు నరేష్,జనరల్ సెక్రటరీ దిలీప్, ఈసీ సభ్యులు శ్రీనివాస్, బురుగుల వెంకటేశ్వర్లు, జేఎన్టీయుహెచ్ జేఏసీ అడ్వైసర్ సరల, ఎంఆర్పియస్ నాయకులు యాదగిరి, లాజర్, సుదర్శన్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి యువమోర్చా నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**




బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో శనివారం గాంధీ భవన్ ముట్టడి లో భాగంగా రాజేంద్రనగర్ పోలీసులు బిజెపి నాయకులను ముందస్తు అరెస్టు చేసి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, సీనియర్ నాయకులు బండారి బాలకృష్ణ,యువ మోర్చా అల్లి శివకుమార్ లు ఉన్నారు.



కూరగాయల పంటలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

# రైతులు కూరగాయ పంటల సాగుకు మొగ్గు చూపాలి

## ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మీన్ భాష

**బుద్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల కొరత 56శాతం పైగానే ఉందని, అందుకే పలు ఇతర రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి పలు రకాల కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నామని, దీనిని అదిగమించేందుకు కాయగూరలు సాగు చేయాలని. తద్వార రైతులు మెరుగైన ఆదాయం పొం దవచ్చని ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాష అన్నారు. రాజేంద్రనగర్ లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వేదికగా కూరగాయల పంటలపై జరుగుతున్న అఖిల భారత సమన్వయ పథకం 44వ వార్షిక సమావేశంలో శనివారం ఆయన పాల్గొని ప్రసం గించారు. కూరగాయల పంటలలో ఉత్పత్తులు పెంచేందుకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూక్ష్మ సేద్య పరికరాలు, మిషనరీ సబ్సిడీపై అందిస్తామని, అధిక దిగుబడి ఇచ్చే రకాలు సిఫార్సు చేస్తామని ఆమె అన్నారు. మిగతా పంటలతో పోలిస్తే కూరగాయల పంటలలో తక్కువ కాలు లో దిగుబడి సాధ్యమని, తద్వార మేలైన ధరలతో సాగు రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. అధిక వేడిని తట్టుకునే రకాలు, ముడత రోగం తట్టుకునే రకాలు, వైరస్ను తట్టుకునే రకాలు, ఎండుతెగులు తట్టుకోవడంతో పాటు అధిక నాణ్యత కలిగిన రకాలు రాష్ట్రంలో సాగుకు అవసరం అన్నారు. సాధ్యమైనంత ఎక్కువ రైతు క్షేత్రాలలో నూతన రకాలు ఉత్తమ పద్ధతులను ప్రదర్శించి రైతులకు అందజేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే, వారణాసి లోని భారతీయ కూరగాయల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్ కుమార్, బెంగుళూరు లోని ఐహెచ్ఎర్ డైరెక్టర్ డాక్టర్ టీ కె బెహర, ఎన్ బీపీజీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి పి. సింగ్, మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ లవండి, ఎన్ఐఆర్సిఏ రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ శేషు మాధవ్, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ అనితా కుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ పి ప్రశాంత్, దేశ వ్యాప్తంగా కూరగాయల పంటలలో పరిశోధనలు చేస్తున్న 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.




హైడ్రా కమిషనర్ ఏ వీ రంగనాథ్ కు వినతి పత్రం అందచేస్తున్న అత్తాపూర్ పరిసర కాలనీల ప్రజలు

# మూసీ పరివాహక ప్రాంతాలలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తప్పవు

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**బుద్వేల్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

మూసి నది ఒడ్డున ప్రమాదకర వ్యర్థ పదర్థాలు, రసాయనాల వల్ల వాయు కాలుష్యం ఏర్పడి అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నాయని అతా బిపూర్, లక్ష్మీనగర్, సోమిరెడ్డినగర్ తదితర కాలనీల ప్రజలు సోమవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను కలసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, మూసీ నది వ్యర్థాలపై సీరియస్ దృష్టి పెడతామన్నారు. ఇతర శాఖలతో సమావేశం నిర్వహించి అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో మూసీ నది ఒడ్డున ప్రమాదకర వ్యర్థాలను, రసాయనాలను వేసే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికులు మూసీ నది ఒడ్డున ఎలాంటి వ్యర్థాలను వేయకూడదన్నారు. ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిం చాలన్నారు.

# ఈనెల 23న శ్రీ అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని దర్శించనున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

## కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**



కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ఈ నెల 23న అలంపూర్ ఆలయాలకు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అలంపూర్ లోని హెలిపాడ్ నుంచి ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏమైనా ప్రమాదకరంగా ఉంటే వాటిని సరి చేయించాలని సూచించారు. అలంపూర్ పట్టణ ప్రధాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక సంఘం అధికారులకు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథి మర్యాదలు చేయాలని, ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. పోలీసుల గౌరవ వందనం, తమ శాఖ నుంచి చేయాల్సిన ఇతర అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా ఫస్ట్ స్టెప్ ఇంటర్నేషనల్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం



చిన్నారులకు మెడల్స్ బహుకరిస్తున్న ముఖ్య అతిథులు



పీ పీ 2 పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ నిర్వహించి సర్టిఫికెట్ లు అందచేసిన పాఠశాల యాజమాన్యం

## ఆడి పాడిన చిన్నారులు

**మణికొండ, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

పుప్పాలగూడలోని ఫస్ట్ స్టెప్ ఇంటర్నేషనల్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. స్థానిక మదుర బ్యాంకెట్ హాల్లో జరిగిన యాన్యువల్ డే సెలబ్రేషన్స్ లో పాఠశాల చిన్నారులు ఆడి పాడారు. ప్రిన్సిపాల్ కె సబిత దగ్గరుండి కార్యక్రమాలను నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి మెడల్స్ బహూకరించారు. పీ పీ 2 పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సెర్మనీ నిర్వహించి సర్టిఫికెట్ లు అందచేశారు.

**ప్రాథమిక విద్య ముఖ్యమైనది : ఈ జీ ఎస్ కిడ్స్ స్కూల్ నిర్వాహకులు బెంజిమెన్ పాల్, ఎస్తేర్ పాల్**

చిన్నారులకు ప్రాథమిక విద్య చాలా ముఖ్యమైనదని



విద్యార్థుల తల్లి తండ్రులు, అతిథులు

నాగారం లోని ఈజీఎస్ కిడ్స్ స్కూల్ నిర్వాహకులు బెంజిమెన్ పాల్, ఎస్తేరు పాల్ లు అన్నారు చిన్నప్పుడు వారు నేర్చుకున్న చదువు పెద్దగైన తరువాత కూడా గుర్తిండి పోతుందన్నారు. చిన్నప్పటి నుంచే ప్రాక్టికల్ విద్యాబోధన మంచిదన్నారు.

**ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాల స్థాపించాం : డైరెక్టర్ డి శాంతి రాజ్ :**

మేం చదువుకునే రోజులలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డాం. పోటీ ప్రపంచంలో చిన్నారులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో ఫస్ట్ స్టెప్ ఇంటర్నేషనల్ ప్రైమరీ స్కూల్లో పుప్పాలగూడ ప్రాంతంలో స్నేహితులతో కలిసి స్థాపించడం జరిగింది విద్యార్థులను ఉత్తమ పోదులుగా తీర్చిదిద్ది నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాము.

కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి రవీందర్, పాఠశాల నిర్వాహకుల కుటుంబ సభ్యులు బత్తుల షాలిని డేవిడ్ రాజు, పమ్మి రాజు , నళిని, ఉపాధ్యాయులు ఏ శ్వేత, జి అర్పణ , లక్ష్మీశ్రీ ప్రభా శ్రీ, స్వర్ణలత, మార్కెటింగ్ ఇంచార్జ్ అనిల్ లు పాల్గొన్నారు.




## ప్రపంచ తెలుగు కవుల మహాసభలకు సామజిక కవి మాన్యపు భుజేందర్ కు ఆహ్వానం

**పాలకుర్తి,ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**




శ్రీపొట్లూరి హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరగనున్న కార్యక్రమానికి మాన్యపు విజేందర్ నీ ఆహ్వానించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ తెలుగు కవుల మహాసభలు దాదాపు రెండు వేల మంది కవుల పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా నిర్వాహకులు పొట్లూరి హరికృష్ణ జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన సామాజిక కవి, శ్రీ పోతన సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యపు భుజేందర్ కు ఆహ్వానం పంపించగా ప్రపంచ తెలుగు కవుల మహాసభలకు హాజరైన భుజేందర్ ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, పొట్లూరి హరికృష్ణ ,లేనిన్ శ్రీనివాస్,తదితర పెద్దలు ప్రపంచ కవిత్వంలో కవిత్వమే తమ ప్రపంచం గా జీవిస్తూ మానవ వికాసానికి సమాజ ప్రకాశానికి సాహితీ సృజన చేస్తున్న భుజేందర్ చిరస్మరణయుడని,తెలుగు భాష సౌందర్యాన్ని తన రచనలతో ప్రశంసిస్తున్న కవి భుజేందర్అని ప్రపంచ తెలుగు కవుల సంఘం, త్రివర్ణ ఫౌండేషన్ అభినందిస్తూ శాలువా ప్రశంస పత్రం జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అందరూ అభినందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా , ఇతర రాష్ట్రాలకు చెందిన కవులు కళాకారులు సాహితీవేత్తలు భుజేందర్ ను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని భుజేందర్ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## ఫీజుల పేరుతో ఇంటర్ హాల్ టికెట్లు ఆపితే కాలేజ్‌లను ముట్టడిస్తాం

**బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**



ఫీజుల పేరుతో ఇంటర్ హాల్ టికెట్లు ఆపితే కాలేజ్ లను ముట్టడిస్తామని బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా బిజెపి యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ పత్రిక సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ కాలేజ్ లలో ఫీజుల పేరుతో హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. సరిగ్గా పరీక్షల సమయంలో ఫీజులు ఇవ్వకపోతే హాల్ టికెట్లు ఇవ్వమని చెప్పడం దుర్మార్గమని అన్నారు. కార్పొరేట్, ప్రవేట్ కాలేజ్ లలో ఫీజుల దోపిడి రోజు రోజుకు ఎక్కువ అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించట్లేదని ఎన్నికల్లో ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్ మీద లేదని అన్నారు. కూకట్ పల్లి, శేరిలింగంపల్లి పల్లి లో ఉన్న కాలేజ్ లలో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే లు పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. ఇంటర్ హాల్ టికెట్ల విషయంలో కాలేజ్ లను హెచ్చరిస్తున్నాం ఇంటర్ హాల్ టికెట్లు ఆపితే కాలేజ్ లను ముట్టడిస్తాం అన్నారు.



పీర్జాదిగూడలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ సోలార్ ఎలక్ట్రో క్లోరినేటర్ ప్లాంట్ పనితీరును పరిశీలిస్తున్న జలమండలి జే ఎం డి మాయాంక్ మిట్టల్

## పలు ప్రాంతాల్లో పర్యటించిన జెఎండీ మయాంక్ మిట్టల్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

జలమండలి జెఎండీ మయాంక్ మిట్టల్ జలమండలి.. బస్తీ బాట.. భాగంగా ఓఅండ్ డివిజన్ నం. 29, పీర్జాదిగూడ సెక్షన్‌లో పరిధిలోని పర్యటించి పీర్జాజాదిగూడలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ సోలార్ ఎలక్ట్రో క్లోరినేటర్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశంలో మెట్రో కస్టమర్ కేర్‌కు వచ్చిన వివిధ ఫిర్యాదులు, కలుషిత నీటి సరఫరా, ట్యాంకర్ల డిమాండ్, నీటి లీకేజీలు మొదలైన అంశాలపై సమగ్రంగా సమీక్షించి, వాటిని గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి

**పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు.




## విద్యార్థుల ఉన్నతికి.... కంప్యూటర్లు ఎంతో ఉపయోగం

**-ఇన్ఫోసిస్ మేనేజర్ రాపాక స్వాతి నాగరాజు**

**పాలకుర్తి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం):**

జనగామ జిల్లా పాలకుర్తి మండలం లో గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇన్ఫోసిస్ సాఫ్ట్వేర్ కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తున్న రాపాక స్వాతి , సి.ఎస్.ఆర్ కో ఆర్డినేటర్ రాపాక నాగరాజు పాఠశాలకు కంప్యూటర్లు అందజేశారు . ఈ సందర్భంగా స్వాతి నాగరాజు మాట్లాడుతూ... శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, అందుపుచ్చుకోవడానికి ఉపయోగపడే సాధనమైన కంప్యూటర్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉంటే పట్టణ ప్రాంత విద్యార్థులు తో సమానంగా అన్ని రంగాలలో రాణించగలుగుతారు, బాలికలు , మహిళలు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్చుకున్నట్లయితే వారు ఆర్థికంగా మంచి ఉన్నత స్థితిలో ఉండటమే కాకుండా వారి కుటుంబాన్ని కూడ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారని ఆలోచన కలిగి ఉన్న ఇన్ఫోసిస్ ఫౌండర్ అయినటువంటి సుధా మూర్తి ఆశయం మేరకు కంప్యూటర్లు అందజేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులు ఈ కంప్యూటర్ల ను ఉపయోగించుకుని చక్కటి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాచర్ల స్వరూప‘ పుల్లయ్య, ఉపసర్పంచ్ కళ్యాణ్, పాఠశాల ఉపాధ్యాయులు స్రవంతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా అదన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతిమా సింగ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21(ప్రభాత ఉదయం)**



రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ప్రతిమాసింగ్ ప్రసూతి సెలవులపై వెళ్లారు. శుక్రవారం తిరిగి అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) బాధ్యతలు స్వీకరించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608